## క్లుప్తంగా

### పోటాపోటీగా షటిల్ బ్యాడ్మింటన్



సామర్లకోటలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

సామర్లకోట: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. ఇప్పటికే సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు ముగియడంతో మండల స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ ఆటల పోటీలు జరుగుతున్నాయి. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. మండల స్థాయి పోటీలు ఈ నెల 22 వరకు జరుగుతాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈ నెల 23 నుంచి నియోజకవర్గ స్థాయిలో పోటీలకు పంపనున్నారు.

### ఎన్టీఆర్‌కు నివాళి

కొత్తపల్లి: పిఠాపురంలోని చిత్రాడ రామాలయం వద్ద మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని మాదక ద్రవ్యాల వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.సూర్యనారాయణ, ఎ.సూరిబాబు, బి.శివ, బి.దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

**సామర్లకోటలో..**

సామర్లకోట: దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతిని స్థానిక మఠంసెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో గాయపడిన త్రిమూర్తులు

పిఠాపురం: స్థానిక బైపాస్ రోడ్డులో విరవాడ జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. కత్తులగూడేనికి చెందిన జోగా త్రిమూర్తులు (69) మోటారు సైకిల్‌పై బైపాస్ రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు నుంచి వస్తుండగా, విరవాడ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా కత్తిపూడి వైపు నుంచి కాకినాడ వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన త్రిమూర్తులను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీనిపై ఏఎస్‌ఐ కేసీహెచ్ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రెండు బైక్‌ల ఢీ

ప్రత్తిపాడు: ధర్మవరంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇరువురు గాయపడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వెల్దుర్తి గ్రామానికి చెందిన యు.బూరయ్య, ధర్మవరానికి చెందిన కె.శ్రీనులు కోల్డ్ స్టోరేజీ వద్ద ఎన్‌హెచ్‌పై రోడ్డును దాటుతుండగా వారి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గాయపడిన బూరయ్య, శ్రీనులను ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### మద్యం విక్రేతల అరెస్ట్

జగ్గంపేట: మామిడాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వేగి ఏసుబాబును అరెస్ట్ చేసి, 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

**తుని:** స్థానిక వీరవరపుపేటకు చెందిన కిల్లాడ రాంబాబు పరదేశమ్మగుడి ప్రాంతం రామకృష్ణా కాలనీలో సారా అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని సీఐ గీతారామకృష్ణ అన్నారు. నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండు విధించిందన్నారు.

### ఘనంగా బాలయోగి మెట్ట తీర్థం



బాలయోగి మెట్ట వద్ద తీర్థంలో జనం

తుని రూరల్: తుని మండలం జగన్నాథగిరి సమీపంలో బాలయోగి మెట్ట వద్ద తీర్థం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా ముక్కనుమ మరుసటి రోజు జరిగే తీర్థాన్ని నిర్వాహకులు గురువారం నిర్వహించారు. జగన్నాథగిరి, ఎస్.అన్నవరం, రాజుపేట, మర్లపాడు, లోవకొత్తూరు, వెలమ కొత్తూరు, తాళ్లూరు, తుని పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొండపై బాలయోగి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఉత్సాహంగా తీర్థంలో పాల్గొన్నారు. రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ష్... పక్కదారికి గ్యాస్!

- వ్యాపార సంస్థల్లో యథేచ్ఛగా రాయితీ సిలిండర్ల వినియోగం
- అసలు లబ్ధిదారులపై పరోక్షంగా భారం
- నిలువరించడంలో అధికారులు విఫలం



వ్యాపార సంస్థలో రాయితీ సిలిండర్ వినియోగం




గ్యాస్ ఏజెన్సీకి వచ్చిన రాయితీ గ్యాస్ సిలిండర్లు

సామర్లకోట: 'ఉన్నత వర్గాల వారు సిలిండర్లపై ఇచ్చే సబ్సిడీని వదులుకుంటే మరింత మంది పేదలకు, స్వల్పాదాయ వర్గాల వారికి ఆ మేలు చేకూర్చవచ్చ'ని ప్రధానమంత్రులు మొదలుకొని ఉన్నత స్థాయి అధికారుల సూచిస్తున్నారు. అది ఉన్నత వర్గాల వారి బాధ్యత కూడా. ఒకవైపు వారు ఇలా ప్రజలను చైతన్యపరుస్తుంటే మరో వైపు ఆ సబ్సిడీ సిలిండర్లు యథేచ్ఛగా దుర్వినియోగం అవుతున్నాయి. వ్యాపార అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లకు బదులు గృహావసర సిలిండర్లను బాహాటంగానే వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి, పేదల ప్రయోజనాలకు గండి కొడుతున్నారు కొందరు వ్యాపారులు. ఇటువంటి వారిని నిలువరించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

పట్టణ, మండల పరిధిలో సుమారు 45 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. గృహావసరాలకు 14.2 కేజీల సిలిండర్లు, వ్యాపార అవసరాలకు 19 కేజీల సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీలు సరఫరా చేస్తున్నాయి. గృహావసర సిలిండర్లపై రూ.280 వరకు సబ్సిడీ ఉండేది. ప్రస్తుతం అది రూ.10.62 పైసలకు దిగిపోయింది. ఇంటికి వచ్చిన సిలిండర్‌కు రూ.932 చెల్లిస్తే మూడు, నాలుగు రోజుల తరువాత సబ్సిడీ మొత్తం వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ప్రారంభంలో సబ్సిడీ మొత్తం తగ్గించి మిగిలిన మొత్తం చెల్లించడం ద్వారా గ్యాస్ సిలిండర్ ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ఖరీదు మొత్తం చెల్లించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ సిలెండర్ తీసుకుని వచ్చే వ్యక్తి అదనంగా సిలిండర్‌కు రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. కాగ కమర్షియల్ సిలిండర్ రూ.1949.50 పైసలు ఉంది. దాంతో వ్యాపార సంస్థలు సబ్సిడీ సిలిండర్‌ను వినియోగిస్తున్నారు.

మండల పరిధిలో గతంలో మూడు ఏజెన్సీల నుంచి రోజుకు 200 నుంచి 250 సిలిండర్లు సరఫరా చేసే వారు. ప్రస్తుతం రోజుకు 600 నుంచి 700 వరకు సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. ఏజెన్సీ సిబ్బందే వ్యాపార సంస్థలకు సబ్సిడీ సిలిండర్లు సరఫరా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**వ్యాపార అవసరాలకు రాయితీ సిలిండర్లు తగదు**



గృహావసర సబ్సిడీ సిలిండర్లను వ్యాపార సంస్థల్లో వాడకూడదు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఎంఎస్‌ఓను తనిఖీలు చేయాలని ఆదేశిస్తాం. ప్రతి గ్యాస్ ఏజెన్సీలో ఉన్న గ్యాస్ కనెక్షన్ల వివరాలను సేకరిస్తాం.

– ఎస్ఎల్‌వీ కుమారి, తహసీల్దార్, సామర్లకోట

### వైద్య వసతులు కల్పించాలని వినతి

పిఠాపురం: ప్రజలకు మెరుగైన వైద్య వసతులు కల్పించాలని కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ మంజు పారకు గొల్లప్రోలుకు చెందిన బీజేపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం పిఠాపురం మండలం కందరాడలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి హాజరైన ఆయన్ని నాయకులు కలిశారు. గొల్లప్రోలులోని ఆయుష్ ఆరోగ్య కేంద్రంపై దృష్టి పెట్టాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను పరిశీలించాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చిట్టా మధు, జిల్లా నాయకుడు కర్రి సత్యనారాయణ, కోశాధికారి పెద్దింశెట్టి మహేష్ తదితరులు ఉన్నారు.

### కాలుష్య కారక పరిశ్రమలను నిలిపివేయాలి

కొత్తపల్లి: తీర ప్రాంతంలో నిర్మిస్తున్న కాలుష్య పరిశ్రమలను వెంటనే నిలిపివేయాలని, సముద్రంలోకి వేసిన పైపులైన్లు తొలగించాలని మత్స్యకార సంఘ నాయకులు అన్నారు. ఉప్పాడ– తొండంగి బీచ్ రోడ్డులో పరిశ్రమల నిర్మాణంపై గురువారం పొన్నాడ శివారు కోనపాపపేట రోడ్డుపై మత్స్యకారులు ఆందోళన చేశారు. తీర ప్రాంతంలో పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలో కలపడం ద్వారా మత్స్య సంపద అంతరించిపోతుందని అన్నారు.

# ప్రగతికి బాటలు వేయాలి



అభివృద్ధి ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: మండల స్థాయి అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళిక మండలం అభివృద్ధికి బాట వేసేలా ఉండాలన్నారు. ఈ ప్రణాళికలో ఆర్థిక వనరులు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ డి.శ్రీలలిత అధ్యక్షత వహించగా, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రణాళికపై అవగాహన అవసరం



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్



సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

పెద్దాపురం: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులకు మరింత అవగాహన అవసరమని ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25 రూపకల్పనపై మండలంలోని ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన జీపీడీపీ అవగాహన సదస్సులో ఎంపీడీఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ 17 రకాల సుస్థిరాభివృద్ధి సూచికలు సాధించేందుకు నిర్దేశించిన 9 థీమ్స్‌లో గ్రామ పంచాయతీకి అవసరమైన ఒక థీమ్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆయా అంశాలను పూర్తి చేసేందుకు సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు శానిటేషన్, తాగునీటి కోసం కేటాయించి ఆన్‌లైన్ విధానంలో ప్రణాళికను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈఓ పీఆర్డీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని చదలాడ, కాండ్రకోట గ్రామాలకు సంబంధించి ఒక్కో థీమ్‌ను ఎంపిక చేసి అప్‌లోడ్ చేసినట్టు తెలిపారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై మరింత అవగాహన కల్పించేందుకు నిర్వహించిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలుడి హత్యకేసులో ఇద్దరికి జైలు శిక్ష

రాజమహేంద్రవరం రూరల్: బాలుడి హత్య, తప్పుడు సాక్ష్యాలు ఇచ్చిన కేసులో ఇద్దరికి రాజమహేంద్రవరం రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.పద్మ జైలుశిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన లక్ష్మికి మల్లెమొగ్గల శివతో వివాహం కాగా, వీరికి ఆరేళ్ల కుమారుడు మంజునాథ ఉన్నాడు. మనస్పర్థల వల్ల వారు విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మికి సామర్లకోటకు చెందిన దోనం దాసు ఎలియాస్ ఆకాష్‌తో పరిచయమైంది. దీంతో లక్ష్మి, తన కుమారుడు మంజునాథను తీసుకుని దాసుతో కలిసి 2021 మార్చిలో రాజమహేంద్రవరం సీతంపేటకు వచ్చింది. ఇంటి యజమాని, చుట్టుపక్కల వారికి తాము భార్యభర్తలమని వారు నమ్మించారు. అదే సంవత్సరం జూలై 27న మంజునాథను టేబుల్ బుక్ చదవమని దాసు చెప్పాడు. అయితే బాలుడు చదవకపోవడంతో కోపంతో దవడలపైనా, తలపైనా గట్టిగా కొట్టాడు. దీంతో మంజునాథ అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. బాలుడిని ఆస్పత్రికి తీసుకువెళ్లిన లక్ష్మి, దోనదాసులు బాలుడు మంచంపై నుంచి పడిపోవడంతో గాయాలయ్యాయని చెప్పారు. వారిద్దరిపై అప్పటి త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో దోనదాసుకు ఐదేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, (సాక్ష్యాలను తారుమారు చేసినందుకు) మూడేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా, కట్టని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. మల్లెమొగ్గల లక్ష్మికి (సాక్ష్యాలను తారుమారు చేసినందుకు) మూడేళ్ల సాధారణ జైలు, రూ.2 వేల జరిమానా, కట్టని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ కె.రాధాకృష్ణ వాదించారు. త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వరరావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పి వీరయ్యగౌడ్ కోర్టులో ట్రయల్ పర్యవేక్షించారు.

### 21 నుంచి శ్రీరామ కల్యాణ పట్టాభిషేకోత్సవాలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అభిషేక కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరగాలన్న సత్సంకల్పంతో 21, 22 తేదీలలో స్థానిక ఆనంద భారతి మైదానంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వేద పండితుడు ఎ.మురళీకృష్ణ గురువారం విలేకర్లకు తెలిపారు. కాకినాడ శ్రీరామ భక్త సమాజం, హిందూ ధర్మ పరిరక్షణ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష కార్యక్రమాల్లో ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. 21న ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన, 8 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర జపం, మధ్యాహ్నం రెండు గంటల నుంచి శ్రీరామ తారక నామ మహా మంత్ర హవనము, సాయంత్రం నాలుగు గంటల నుంచి సకల వాహిని బృందంచే ప్రత్యేక కీర్తనలతో భజన, సాయంత్రం ఐదు గంటలకు శ్రీ సీతారామచంద్రమూర్తి స్వామి వారి దివ్య కళ్యాణం చతుర్వేద స్వస్తి జరుగుతుందన్నారు. అయోధ్య నుంచి వచ్చిన మంత్రాక్షతలను భక్తులకు అందజేయనున్నట్టు వారు వివరించారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర జపము, 9 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర హవనము, 11 గంటలకు మహా పూర్ణాహుతి జరుగుతాయన్నారు. 11.30 గంటలకు అయోధ్య వాసి శ్రీరామచంద్రమూర్తి స్వామివార్లకు పట్టాభిషేక మహోత్సవం జరుగుతుందని అనంతరం చతుర్వేద స్వస్తి, వితరణం, కళ్యాణ అయోధ్య అక్షింతలు భక్తులకు అందజేయడం జరుగుతుందన్నారు.

### మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ తదితరులు

కిర్లంపూడి: దళితుల మనోభావాలు దెబ్బతీసేలా రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి గునిపే భరత్ మాట్లాడడం సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ అన్నారు. గోకవరంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం రాష్ట్ర చరిత్రలోనే సువర్ణ అధ్యాయం అన్నారు. ఈ విగ్రహం ఏర్పాటుపై దళితుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం బాధాకరమన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పసుపు, కుంకుమల పేరుతో దారి మళ్లించిన ఘనత అప్పటి సీఎం చంద్రబాబుదేనని అన్నారు. కారంచేడు వివాదాల్లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దళితులను ఊచకోత కోసి గోనె సంచిలో మూటగట్టి పడేసిన సంఘటనలు గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బిజ్జిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ, అంబటి ప్రసన్న, మచ్చా మోహన్, మచ్చా జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

# పండగ నుంచి పనుల్లోకి..



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

- రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ కిటకిట
- తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు

సామర్లకోట: కాకినాడ జిల్లాకు ముఖ్య కూడలి అయిన సామర్లకోట రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లు గురువారం ప్రయాణికులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ప్రయాణికులు తిరుగు పయనమయ్యారు. విశాఖపట్నం, విజయవాడ వైపు నుంచి వచ్చిన ప్రయాణికులు రైళ్లలో వెళ్లడానికి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తరలివచ్చారు. దాంతో ఒకటో నెంబరు, మూడో నెంబరు ప్లాట్‌ఫారాలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సందర్భంగా బంధువులు, స్నేహితులతో గడిపి తీపి జ్ఞాపకాలతో ఉద్యోగ, వ్యాపారాది పనుల్లోకి వెళ్లిపోతున్నారు. సామర్లకోట నుంచి కాకినాడ, పెద్దాపురం, కిర్లంపూడి, జగ్గంపేట, ఏలేశ్వరం, పిఠాపురం, వేట్లపాలెం, ప్రత్తిపాడు తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాక పోకలు సాగిస్తారు. ప్లాట్‌ఫాంపై రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో ప్రయాణికుల అప్రమత్త కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగ్‌లు తరుచూ చోరీకి గురికావడంతో ప్రతి 10 నిమిషాలకు దొంగలు ఉంటారు జాగ్రత్త అంటూ ప్రయాణికును అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైల్వే స్టేషన్ ఎదురుగానే బస్సు కాంప్లెక్స్ ఉండడంతో బస్సు కాంప్లెక్స్ ప్రయాణికులతో నిండిపోయింది.

# సెబ్ దాడులు: ముగ్గురి అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న సారా, మద్యంతో సెబ్ సీఐ అశోక్

ప్రత్తిపాడు: మండలంలో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం .. ఇ.గోకవరం అటవీ ప్రాంతాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించి, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, తుట్టా సత్యనారాయణపై పరారీ కేసు నమోదు చేశారు. ఒమ్మంగిలో కుక్కల గన్నమ్మను అదుపులోకి తీసుకుని, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరంలో ముద్దా నూకరాజు నుంచి 35 మద్యం సీసాలు, వెంకటనగరంలో కూసు మంచి నానాజీ నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈ దాడిలో జిల్లా సెబ్ టాస్క్‌ఫోర్స్ వింగ్ సీఐ బి.వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో గురువారం రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు అతిథులుగా హాజరై ఎంపికలను ప్రారంభించారు. ఈ ఎంపికల్లో 10 వెయిట్ కేటగిరిల్లో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో సీనియర్ పురుషులు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ జి.ఎలీషాబాబు మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీలలో పిఠాపురంలో జరిగే సీనియర్స్ రెజ్లింగ్ పోటీలకు 30 మందితో కూడిన జిల్లా జట్టును ఎంపిక చేశామన్నారు. ఈ ఎంపికల్లో జిల్లా రెజ్లింగ్ సంఘ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి, డీఎస్ఏ రెజ్లింగ్ కోచ్ దుర్గ, క్రీడాకారులు పాల్గొన్నారు.

### సాగర తీరం.. ఉల్లాసభరితం



కొత్తపల్లి: చల్ల చల్లని గాలులు.. ఎగసి పడే కెరటాల నడుమ ఉప్పాడ సముద్ర తీరం సందర్శకులతో కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సందడి చేశారు. సముద్ర స్నానాలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ ఉన్న తీర ప్రాంతం సందర్శకులతో కళకళలాడింది. భారీ సంఖ్యలో వాహనాలు రావడంతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది.



ఉప్పాడ బీచ్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

# వినికిడి సమస్య లేని జిల్లాగా కాకినాడ

- పరిపూర్ణానంద సరస్వతి
- పలు సంస్థలు అందించిన వినికిడి యంత్రాల పంపిణీ



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న పరిపూర్ణానంద సరస్వతి

బోట్‌క్లబ్: జిల్లాను వినికిడి సమస్యలేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు తోట సుబ్బారావు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీ పీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఆ సంస్థల ఆధ్వర్యంలో గురువారం వినికిడి సమస్యలతో బాధపడుతున్న 150 మంది పేదలకు రూ.30 లక్షల విలువైన వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ తోట సర్వారాయుడు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ఇప్పటి వరకు 250 మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు మాట్లాడుతూ ఇప్పటివరకు 10 వేల వినికిడి యంత్రాలను ఉచితంగా, ఐదు వేల యంత్రాలను 50 శాతం ధరలకు అందించినట్లు తెలిపారు. కాకినాడ ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్వీ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి వినికిడి సమస్య లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్లు చెక్కా రమేష్, అనపర్తి వెంకటేష్ పాల్గొన్నారు.